క్లుప్తంగా

పారాయణను విజయవంతం చేద్దాం



పారాయణ మహాయజ్ఞం కార్యాచరణలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2న అమలాపురం కాపు కల్యాణ మండపంలో జరగనున్న సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞాన్ని భక్తులంతా సమష్టిగా విజయవంతం చేద్దామని ఆ పరిషత్ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక నల్లా వీధిలోని శ్రీరామాలయం, సాయిబాబా ఆలయాల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన పారాయణ మహాయజ్ఞ కార్యాచరణలో సుబ్రహ్మణ్యం మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ మాట్లాడుతూ సామూహిక పారాయణంతో లోక కల్యాణం సిద్ధిస్తుందన్నారు. మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, శ్రీరామాలయం, సాయిబాబా ఆలయ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థినికి ప్రోత్సాహకాలు అందజేస్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్

అల్లవరం: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన ఎస్సీ విద్యార్థులకు అల్లవరంలోని మానవ వనరుల కేంద్రంలో మండల ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోసుగంటి గంగయ్య మెమోరియల్ ట్రస్టు సహకారంతో ప్రోత్సాహకాలను శుక్రవారం అందజేశారు. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పే నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమోహన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందించారు. న్యాయవాది డీబీ లోక్, ఎంపీడీఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, ఎస్సీ వెల్ఫేర్ సంఘ జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు, ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు మోసుగంటి వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, సాధనాల సత్యనారాయణ, గెడ్డం ప్రదీప్ పాల్గొన్నారు.

నారుమడులు త్వరగా వేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి బోస్‌బాబు

అమలాపురం రూరల్: సార్వా వరి నారుమడులు త్వరగా వేసుకునేలా రైతులను వ్యవసాయ అధికారులు చైతన్యపర్చాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోస్‌బాబు సూచించారు. సబ్ డివిజన్‌లోని ఏఓలు, ఏఈఓలు, వీఏఏలు, వీహెచ్‌లతో అమలాపురం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సార్వా 2024 ముందస్తు ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బోస్‌బాబు మాట్లాడుతూ రైతులు సకాలంలో సార్వా పనులు చేపట్టాలన్నారు. పంటకోత ప్రయోగ కిట్లు ఉద్యోగులకు పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ ప్రాధాన్య అంశాలపై సలహాలు, సూచనలు అందించారు. అమలాపురం సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ, ఏడీఏ ఎఫ్‌టీసీ ఎ.రాజశేఖర్, అమలాపురం, అల్లవరం, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాల ఏఓలు కడల ధర్మప్రసాద్, ఎన్‌వీవీ సత్యనారాయణ, వై.శోభ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపుష్పయాగం



బండారులంకలో త్ర్యంబకేశ్వరుని శ్రీపుష్పయాగ పూజల్లో భక్తులు

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో భువనేశ్వరి సమేత త్ర్యంబకేశ్వర స్వామి ఆలయంలో పంచరాత్రి దివ్య కల్యాణం సందర్భంగా శ్రీపుష్పయాగం ఘనంగా జరిగింది. ఈ క్రతువులను కాసిన భీమశంకర్ దంపతులతో ఆలయ పురోహితుడు సద్గురువు సత్యనారాయణ నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్టీ చింతా శంకరమూర్తి, బాలాజీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సేవే పరమావధిగా..

- దివ్యాంగులకు అండగా అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్
- ఫిజియోథెరపీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిన వైనం

తాళ్లరేవు: సేవే పరమావధిగా సాగుతున్నారు.. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.. అందరికీ ఆదర్శవంతమైన సేవలు అందిస్తున్నారు.. కోరంగి పంచాయతీ సీతారామపురంలోని ధీరూభాయ్ అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ అనేక మందికి వివిధ సేవలందిస్తూ అండగా నిలుస్తుంది. ఖరీదైన వైద్యాన్ని సైతం ఉచితంగా అందించడం, మానసిక వికలాంగులను అక్కున చేర్చుకుని వారిని సకలాంగులుగా తీర్చిదిద్దడం తదితర నిరంతర సేవలతో ప్రజల మన్ననలు పొందుతోంది. తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి అనేక మంది ఇక్కడకు వచ్చి సేవలతో స్వాంతన పొందుతున్నారు. మండలంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్మించిన అనంతరం వారి ఆర్థిక సహాయంతో 2009లో రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ పేరిట సేవలను ప్రారంభించారు. ఉమా మనోవికాస కేంద్రం సహకారంతో దివ్యాంగుల పాఠశాలతోపాటు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదలకు కొండంత అండగా నిలుస్తున్నారు. 2017 వరకూ అద్దె భవనంలో కొనసాగిన సేవలు ఐదేళ్ల కిందట సీతారామపురంలోని సొంత భవనంలోకి మారాయి. ప్రధానంగా తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన మానసిక దివ్యాంగులను గుర్తించి వారిని సాధారణ పిల్లలుగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్నారు. వారిలో మార్పు తీసుకురావడంతోపాటు ప్రత్యేకమైన విద్యనందించి సమాజంలో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల కాలంలో అధిక శాతం మంది కాళ్లు, చేతులు, మెడ తదితర నొప్పులతో బాధపడడం చూస్తున్నాం. వీటికి ప్రధానంగా మందులతోపాటు ఫిజియోథెరపీ చేయిస్తేనే శాశ్వతంగా నయమవుతుందని వైద్యులు చెబుతుంటారు. ఈ కేంద్రంలో ఎటువంటి రుసుం తీసుకోకుండా ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందించడం విశేషం. వివిధ రకాల నొప్పులతో బాధపడుతూ ఈ కేంద్రానికి



మానసిక దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న సిబ్బంది

వచ్చేవారిని తిరిగి మామూలు వ్యక్తులుగా మార్చి పంపిస్తున్నారు. ధనిక, పేద అనే తేడా లేకుండా వైద్యం కోసం వచ్చిన వారందరికీ సేవలందించడం ప్రత్యేకత. అందుకే ఈ కేంద్రం ఫిజియోథెరపీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అలాగే స్పీచ్‌థెరపీ, మ్యూజిక్ అండ్ యోగా థెరపీ, ఒకేషనల్ ట్రైనింగ్ తదితర సేవలు అందిస్తున్నారు. 13 ఏళ్లుగా నిరాటంకంగా సేవలు కొనసాగుతున్నాయి.



వైద్య సేవలు అందిస్తున్న ఫిజియోథెరపీ వైద్యుడు శ్రీకాంత్

సేవలను విస్తరిస్తాం



రిలయన్స్ వ్యవస్థాపకులు ధీరూభాయ్ అంబానీ పేరిట కేంద్రాన్ని నిర్వహిస్తూ అనేక సేవలను ప్రజలకు అందిస్తున్నాం. ముఖ్యంగా మానసిక దివ్యాంగులకు అందించే సేవలు ఎనలేనివి. ఇక్కడ సిబ్బంది ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాం. ఇందులో భాగంగా ఈ భవనంపై అంతస్తు నిర్మించి మరింత మందికి సేవలందిస్తాం. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మానసిక దివ్యాంగులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు. –సుబ్రహ్మణ్యం, జనరల్ మేనేజర్, రిలయన్స్ సీఎస్ఆర్ డిపార్ట్‌మెంట్

దివ్యాంగులకు వరం



మేనరిక వివాహాలు, ఇతర పౌష్టికాహార లోపం తదితర కారణాలతో కొంతమంది పిల్లలు మానసిక దివ్యాంగులుగా మారుతున్నారు. ముఖ్యంగా తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో అధిక శాతం మంది మానసిక దివ్యాంగులు ఉంటున్నారు. అటువంటి వారిని గుర్తించి వారికి రిలయన్స్ ఆర్థిక సహాయంతో నిపుణులైన ఉపాధ్యాయులతో ఉచితంగా కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు ఉచితంగా విద్య, భోజనం, రవాణా తదితర సౌకర్యాలు కల్పిస్తున్నాం.

–ఎంవీ గోపాల్, రిలయన్స్ దివ్యాంగుల కేంద్రం ఇన్‌చార్జి

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్లు లెక్కించే కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లాస్థాయి అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఓట్ల లెక్కింపును దృష్టిలో ఉంచుకుని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో హైస్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు ప్రవేశ మార్గాలు, హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం, 360 డిగ్రీల పరిధిలో సీసీ కెమెరాల అమరిక, పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్ల సౌకర్యార్థం మరుగుదొడ్లు, మౌలిక వసతులపై ఆరా తీశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద 20 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సురేష్ బాబును కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేందుకు చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో ఈఈ రవి కుమార్‌ను, హైస్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటు



చెయ్యేరులో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

చేయాలని బీఎస్ఎన్ఎల్ ఇంజినీర్లను ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.చంటిబాబు, ఆర్‌అండ్‌బీ అధికారి రాము తదితరులు ఉన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



పాత బండారులంకలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

అమలాపురం రూరల్: పాత బండారులంకలో వేంచేసి ఉన్న పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామివారి తీర్థ కల్యాణోత్సవాల సందర్భంగా శుక్రవారం సామూహిక లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. కారుపర్తి మల్లేశ్వరరావు, శిష్య బృందం అర్చకత్వంలో 108 మంది మహిళలు పూజలు చేశారు. ఆ ప్రాంతంలో గోవింద నామస్మరణ మార్మోగింది. గోవు చుట్టూ 5 ప్రదక్షిణలు చేసి ప్రత్యేక గో పూజలు చేశారు. మహిళలకు లక్ష్మీదేవి డాలర్, లడ్డూ ప్రసాదం, రవికుల వస్త్రం, గాజులు, పూజా మాట్, పూజా సామగ్రిని కమిటీ సభ్యులు ఉచితంగా అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత చింతపట్ల కృష్ణ రామ్మోహనరావు, విజయలక్ష్మి దంపతులచే అభిషేకాలు నిర్వహించారు. హైదరాబాద్ చెందిన కాశిన గణపతిశాస్త్రి, రేఖ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమభారతి, శ్రీనివాసా బాల మిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, అంకం నాగ సత్యనారాయణ, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం పెదరాజు, లెక్కింశెట్టి చందు పాల్గొన్నారు.

పంట కాలువలను కలుషితం చేయొద్దు

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ప్రజల దాహార్తిని తీర్చే పంట కాలువలను కొందరు కలుషితం చేయడంపై ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక హైస్కూల్ సెంటరులోని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట కాలువల్లోకి ముఖ్యంగా అమలాపురంతో పాటు కొన్ని మేజర్ పంచాయతీల్లో ఇళ్ల నుంచి ఉత్పన్నమయ్యే మలినాలు కలిపేస్తూ కాలుష్యానికి పాల్పడుతున్నారన్నారు. కాలువల నుంచి పారే పవిత్ర గోదావరి జలాలను అంతే పవిత్రంగా కాపాడుకుని మానవ అవసరాలు తీర్చుకోవాలని సూచించారు. కాలువలు కాలుష్య కోరల్లోకి చిక్కకుండా కాపాడుకోవాలని స్పష్టం చేశారు. ఈ రెండు విషయాలపై కలెక్టర్ హిమాన్షు శుక్లాను స్వయంగా కలిసి చర్చిస్తానని చెప్పారు. సాగు, తాగునీరు అందించే పంట కాలువల ఆధునీకరణకు జల వనరుల శాఖ అధికారులు కూడా చొరవ చూపాలని ఆయన సూచించారు. పంట కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్సీ తెలిపారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, నాయకులు కుడుపూడి త్రినాథ్, వేగిరాజు సాయిరాజు, ముంగర ప్రసాద్, యనమదల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

అమలాపురం రూరల్: ఎన్నికల కౌంటింగ్ తదితర సమయాల్లో యువత అత్యుత్సాహం ప్రదర్శించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్ బాబు హెచ్చరించారు. ఇందుపల్లి గ్రామంలో ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కేసుల్లో ఇరుక్కుంటే బంగారు భవిష్యత్తు దూరమవుతుందని హితవు పలికారు. జిల్లాలో ఎలక్షన్ కౌంటింగ్ ప్రక్రియకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా, తప్పుడు సమాచారం సోషల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై శేఖర్‌బాబు

మీడియాలో షేర్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కుడుపూడి నాగరాజు, ఎం.పోలయ్య, కుడుపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలతోనే లంక భూములు సస్యశ్యామలం



లంక గ్రామాలకు సాగునీటిని అందిస్తున్న బోరు బావి

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరంలోని లంక గ్రామాల రైతులు సుదీర్ఘ కాలం నుంచి సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎంతో సారవంతమైన భూములు సరైన సాగునీరు లేక నిస్సారంగా మారి పోయాయి. భూగర్భం నుంచి వచ్చే జలాలు ఉప్పునీటి మయంగా మారడం రైతులను కలవరపెడుతోంది. ఉప్పు నీటి ప్రభావంతో కొబ్బరికాయల దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. వేలాది రూపాయల వ్యయం చేసి ఏటా వేసవిలో రైతులు కొబ్బరి తోటలకు నీటి తడులు పెడుతున్నారు. దీని కోసం ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సిన పరిస్థితి. ఎంతో మంది పాలకులు మారినా రైతుల పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు.

లంక గ్రామాలకు సాగునీరందించే అప్పనపల్లి ఎత్తిపోతల పథకానికి కార్యాచరణ చేపట్టామని గత పాలకులు చెప్పినా ఫలితం శూన్యం. ఈ పథకం నిర్మాణానికి కార్యాచరణ చేపట్టామని ప్రస్తుతం అధికారులు చెబుతున్న మాటలు రైతుల్లో ఉత్సాహం నింపుతున్నాయి.

నాలుగు వేల ఎకరాలకు మేలు

అప్పనపల్లి, పెదపట్నంలంక, పెదపట్నం, బి.దొడ్డవరం, మానేపల్లి గ్రామాలకు అప్పనపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మేలు జరుగుతుంది. చుట్టూ పుష్కలంగా గోదావరి జలాలు అందుబాటులో ఉన్నా ఆ జలాలు ఉప్పునీటి మయం కావడంతో ఇక్కట్లు తప్పడం లేదు. అప్పనపల్లి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు రూ.46.46 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. అయిదు గ్రామాల్లో 15 కిలోమీటర్ల పంట కాలువ ఏర్పాటుతో 4,085 ఎకరాల్లోని కొబ్బరి తోటలకు ప్రయోజనం కలుగుతుంది. దీంతో పాటు కొబ్బరి తోటల్లో అంతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. బ్రిటీషు వారి హయాంలో పై అయిదు గ్రామాలకు ఇరిగేషన్ సదుపాయం ఉండేది. ప్రస్తుతం ఈ గ్రామాలకు ఇరిగేషన్ సదుపాయం లేకపోవడంతో ఆ గ్రామాల రైతులు బోరు బావులపై ఆధారపడి కొబ్బరి సాగు చేస్తున్నారు. అప్పనపల్లి ఎత్తిపోతల పథకం కార్యారూపం దాల్చిన పక్షంలో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

చల్లగాలి వీచే.. చిరుజల్లు కురిసే





వానపల్లిపాలెంలో కమ్ముకున్న మబ్బులు (అంతర చిత్రం) గొల్లవిల్లిలో కురుస్తున్న వర్షం

ఉప్పలగుప్తం: వేడెక్కించిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.. అల్పపీడనం నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. పలు గ్రామాల్లో మేఘాలు కమ్ముకుని చల్లని గాలులు వీచాయి. వర్షం కూడా పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

అల్లవరంలో భారీ వర్షం

అల్లవరం: అల్పపీడనం ప్రభావంతో అల్లవరం మండల వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రానికి దట్టమైన మేఘాలు కమ్ముకుని ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. బలమైన గాలులు వీయడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వ్యవసాయ శాఖాధికారులు అప్రమత్తమయ్యారు. కళ్లాల్లోని నిల్వ చేసిన ధాన్యం రాశులపై బరకాలు కప్పి ఉంచాలని, ధాన్యం బస్తాలను మెరక ప్రాంతాలకు తరలించుకోవాలని రైతులకు సూచనలు చేశారు.



దేవగుప్తంలో గాలులతో కూడిన వర్షం

మలేరియా నివారణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుత సీజన్‌లో సంభవించే మలేరియా జ్వరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కొత్తపేట డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులోని మూడు గ్రామ సచివాలయ పరిధిలో ఇటుక బట్టీ కార్మికుల కుటుంబాలను సందర్శించి పలువురికి మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మలేరియా వ్యాప్తి చెందే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్యాధికారి డి.సాయికిషోర్ నిర్వహించారు. సుమారు 150 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ ముద్రగడ శ్రీనివాసరావు, వైద్యారోగ్య సిబ్బంది కె.సుమాంజలి, భాను, శ్వేత, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో ఇటుక బట్టీ కార్మికులకు మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

సంపూర్ణ పారిశుధ్య చర్యలు పాటించాలి



చింతలూరులో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (ఫ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఐ.పోలవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఎండీ అమీలు జమ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

విద్యుదాఘాతానికి ఆవుల మృతి

ముమ్మిడివరం: పొలాల్లో మేస్తున్న రెండు ఆవులు విద్యుదాఘాతానికి మృతి చెందాయి. కొత్తలంక పంచాయతీ పరిధిలో గంగుల శంకర్ అతని చిన్నాన్న గోవిందుకు చెందిన రెండు చివుడు ఆవులను శుక్రవారం కాలువ గట్టు సమీపంలో పొలాల్లోకి తీసుకెళ్లారు. అక్కడ అవి మేస్తుండగా విద్యుత్ స్తంభం దగ్గరలో ఒక విద్యుత్ తీగ తెగిపడి వాటిపై పడటంతో ఆ రెండు ఆవులు మృతి చెందాయి. ఆవుల మృతితో జీవనోపాధి కోల్పోయామని బాధితులు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై డి.సురేష్‌బాబు కేసు నమోదు చేశారు.


ఎన్జీఓ నాయకుడి మృతి



కటికదల సుబ్బారావు

ముమ్మిడివరం: ముమ్మిడివరం తాలుకా ఉద్యోగుల సంఘ జేఏసీ మాజీ అధ్యక్షుడు, ఎన్జీఓ నాయకుడు శ్రీభగవాన్ బాల యోగీశ్వరుల కుటుంబ సభ్యుడు కటికదల సుబ్బారావు (74) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య భారతి, కుమారుడు భరణికుమార్, కుమార్తె, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కాశి బాల మునికుమారి. సుబ్బారావు మృతికి పలు ఉద్యోగ, కార్మిక సంఘాలు సంతాపం వ్యక్తం చేశాయి. మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఆకట్టుకుంటున్న ఆదిశంకరాచార్య చిత్రం



ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదిశంకరాచార్య చిత్రపటం భక్తులను ఆకట్టుకుంటుంది. ఆలయంలో వినాయకుని దగ్గర ఉన్న ఆదిశంకరాచార్య చిత్రపటం పెయింటింగ్ పోవడంతో ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ చొరవతో కొత్తగా తిరిగి వేయించారు. సాక్షాత్తు పరమేశ్వర స్వరూపంగా భావించే ఈ చిత్రపటం మంత్రముగ్ధులను చేస్తుంది.

ముగిసిన స్వామివార్ల కల్యాణోత్సవాలు

తాళ్లరేవు: కేశవపురం గ్రామంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాతకోరంగిలో బాలా త్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి, సుంకర పాలెం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి, తాళ్లరేవు ప్రధాన రహదారిలో భూ సమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరిరోజైన శుక్రవారం రాత్రి శ్రీపుష్పోత్సవాలు నిర్వహించారు. సుంకరపాలెంలో ఆలయ అర్చకుడు శ్రీకంఠం భీమేశ్వరశర్మ పర్యవేక్షణలో స్వామివారి ఊంజల్ సేవ, శ్రీపుష్పోత్సవం కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.